

ఆనందాల కేళి

రంగుల పండుగ హోలీని శుక్రవారం జిల్లాలో ఉత్సాహంగా జరుపుకున్నారు. చిన్నా పెద్దా అందరూ కలిసి రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.

- 8లో..



దేవాలయాల్లో రెచ్చిపోయిన దొంగలు

ముండ్లమూరు మండలంలో ఒకే రోజు రెండు గ్రామాల్లోని నాలుగు ఆలయాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. అర్ధరాత్రి కరెంటు కట్ చేసి దొంగతనం చేశారు.

- 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 34/25

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

శనివారం	ఇఫ్తార్	
సాయంత్రం	గం 6 : 25	
ఆదివారం	సహరి	
ఉదయం	గం 4 : 57	

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల్లో పలువురి నియామకం

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లాకు చెందిన వారిని రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాల్లో నియమించినట్లు శుక్రవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. వరుసగా రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ సెక్రటరీగా తేళ్ల రాజులు (దావీదు), రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ జాయింట్ సెక్రటరీలుగా మద్దులూరి సుబ్బారావు, డి.ప్రసాద్‌రెడ్డి, దొడపాటి ఇంద్రసేనారెడ్డి, రాష్ట్ర మైనారిటీ సెల్ సెక్రటరీలుగా ఎస్‌కే బుజ్జి (ఖాదర్‌మస్తాన్), ఎండీ అబ్దుల్ గఫార్, ఎ.గోరి, రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీగా పఠాన్ రియాజ్, రాష్ట్ర ఐటీ వింగ్ జోనల్ ప్రెసిడెంట్‌గా మణికంఠేశ్వరరెడ్డి పూసపాటి, రాష్ట్ర ఐటీ వింగ్ జాయింట్ సెక్రటరీలుగా ఎనిమిరెడ్డి ఓబుల్‌రెడ్డి, కాసు శ్రీనివాసరెడ్డిని నియమించినట్లు పార్టీ కార్యాలయం తెలిపింది.

17 నుంచి ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్

ఒంగోలు సిటీ: ఇంటర్మీడియెట్ పరీక్షల స్పాట్ వాల్యుయేషన్ ఈనెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆర్‌ఐఓ సైమన్ విక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు మార్చి–2025 స్పాట్ క్యాంప్ (మూల్యాంకన శిబిరం) ఒంగోలులోని ఏకేవీకే జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే సంస్కృతం వాల్యుయేషన్ ప్రారంభం కాగా పూర్తి స్థాయి స్పాట్ క్యాంప్ నాలుగు విడతల్లో జరగనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి కొత్తగా ఒకేషనల్ సబ్జెక్టులను కూడా ఒంగోలు క్యాంపులో వాల్యుయేషన్ చేయనున్నట్లు చెప్పారు.

నాలుగు విడతల వారీగా షెడ్యూల్ ఇలా...

- మొదటి విడత 17వ తేదీ సోమవారం జనరల్ ఇంగ్లిష్, ఒకేషనల్ ఇంగ్లిష్, తెలుగు, హిందీ, మ్యాథ్స్, సివిక్స్‌తో పాటు ఒకేషనల్ ఎల్.ఎం.డి, ఎ అండ్ టి, ఓ.ఎ, సి.ఎస్.ఈ, ఎం.ఎల్.టి, ఎం.పి.హెచ్.డబ్ల్యూ.ఫీమేల్ కోర్సుల పేపర్ల వాల్యుయేషన్ ఉంటుంది.
- రెండో విడత 22వ తేదీ శనివారం ఫిజిక్స్, ఎకనామిక్స్, జి.ఎఫ్.సి, ఒకేషనల్ ఈ.ఈ.టి
- మూడో విడత 24వ తేదీ సోమవారం కెమిస్ట్రీ, హిస్టరీ
- నాలుగో విడత 26వ తేదీ బుధవారం బోటనీ, జువాలజీ, కామర్స్‌తో పాటు ఒకేషనల్ బ్రిడ్జికోర్సు మ్యాథ్స్, ఫిజికల్ సైన్సెస్, బయోలాజికల్ సైన్సెస్ వాల్యుయేషన్ చేస్తారు.

కళాశాల లాగిన్లలో నియామక ఉత్తర్వులు: స్పాట్ క్యాంప్ విధులకు వివిధ హోదాలకు సంబంధించిన నియామక ఉత్తర్వులను ఇంటర్మీడియెట్ విద్యామండలి వారు కళాశాల లాగిన్లలో ఉంచుతారు. నియామక ఉత్తర్వులను డౌన్‌లోడ్ చేసుకొని నిర్ణీత తేదీల్లో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు స్పాట్ క్యాంపు విధులకు హాజరు కావాలి.


స్పాట్‌కు హాజరుకాకపోతే జరిమానా

స్పాట్ క్యాంప్ విధులకు హాజరుకాని అంశంలో ఇంటర్మీడియెట్ విద్యామండలి కఠినంగా వ్యవహరించనుందన్నారు. బోర్డు నిబంధనలను, ఉత్తర్వులను ఉల్లంఘిస్తే రూ.5 వేల మేరకు అపరాధ రుసుం వసూలు చేయడంతో పాటు క్రమశిక్షణ చర్యలు ఉంటాయి. స్పాట్ క్యాంపునకు తమ సిబ్బందిని రిలీవ్ చేయడంలో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే బోర్డు నిబంధనావళి మేరకు కఠిన చర్యలు ఉంటాయని ఆర్‌ఐఓ హెచ్చరించారు.

పోయాం..మోసం

నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఒక షూ మార్ట్ నిర్వాహకులు 50 శాతం ధరలకే చెప్పులు విక్రయిస్తుండడంతో జనం ఎగబడి కొన్నారు. ఇస్లాంపేటకు చెందిన ఒక వ్యక్తి చెప్పులు కొనుగోలు చేసి రెండు రోజుల తరువాత వేసుకున్నాడు. కొంచెం దూరం వెళ్లాడో లేదో ఆ చెప్పులు విరిగిపోయాయి. దుకాణం వద్దకు వెళ్లి ఇదేమని అడిగితే ఆఫర్లు పెట్టింది అందుకోసమే.. వెనక్కి తీసుకోమని నిర్వాహకులు కరాఖండీగా చెప్పేశారు.

నగరంలోని ఒక బడా మార్ట్‌లో నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసిన దంపతులకు ఎందుకో అనుమానం వచ్చింది. ఇంటికి వెళ్లి సరుకులను తూకం వేసి చూసుకున్నారు. దాదాపుగా ప్రతి వస్తువు తూకంలో కనీసం 100 గ్రాముల వరకు తక్కువగా వచ్చింది.





- అడుగడుగునా దోపిడీ
- కళ్లు మూసి తెరచేలోపే జేబులకు చిల్లు
- కూరగాయలు, నిత్యావసర వస్తువుల తూకాల్లో చేతివాటం
- నిత్యావసర వస్తువుల దుకాణాల్లో కాటా మోసం
- పచ్చి వ్యాపారంలో ఎక్కువగా తూకాల్లో తరుగు
- ఆఫర్ల ముసుగులో వినియోగదారులకు టోపీ
- అమలుకాని వినియోగదారుల చట్టాలు
- మొక్కుబడిగా తూనికలు, కొలతలశాఖ అధికారుల తనిఖీలు
- నేడు వినియోగదారుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్

ఒంగోలు టౌన్/ ఒంగోలు సిటీ: ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధిక ధరలకు విక్రయించినా, నాణ్యత లేని వస్తువులను అమ్మినా, తూనికల, కొలతల శాఖాధికారులకు ఫిర్యాదు చేస్తే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తారు. ప్రజలకు అవగాహన లేకపోవటం, అధికారుల దాడులు తక్కువ కావటంతో వ్యాపారులదే ఇష్టారాజ్యమైంది. వివిధ సినిమా థియేటర్లలో కూల్‌డ్రింక్స్, తినుబండారాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కూరగాయల మార్కెట్‌లో పాతకాలం తూకాలతో ప్రజలకు కూరగాయలు విక్రయిస్తున్నారు. ఎలక్ట్రానిక్ కాటాలను సైతం ట్యాంపరింగ్ చేసి వస్తువులను తూకం వేసి దోచేస్తున్నారు. చికెన్, మటన్, చేపల దుకాణాలతో తూకం మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వినియోగదారుల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' బృందం నగరంలోని వివిధ దుకాణాలు, మార్కెట్లను సందర్శించింది. దుకాణాల్లో తూనికలు, కొలతలు, నాణ్యత, కల్తీలను పరిశీలించింది. ఈ పరిశీలనలో అనేక మోసాలు వెలుగులోకి వచ్చాయి. అత్యధిక దుకాణాల్లో డిజిటల్ కాటా మిషన్లు వినియోగిస్తున్నారు. అయితే ప్రతి సరుకు మీద 100 గ్రాములు తూకం తక్కువగా ఉండడం బృందం గమనించింది. కూరగాయల దుకాణాల్లో తూకాలు మరీ దారుణంగా ఉన్నాయి. చేపలు, చికెన్, మటన్ దుకాణాల్లో వినియోగిస్తున్న కాటాలు ఏ మాత్రం పనికొచ్చేలా లేవు. ఒక వైపు ధరలు బెంబేలెత్తిస్తుండగా తూకంలో మోసాలతో జనం జేబులకు చిల్లులు వేస్తున్నారు. మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు ఎప్పుడో నెలాఖరున జేబులో ఖర్చులకు డబ్బులు లేనప్పుడు మాత్రమే తనిఖీలకు వెళ్లి షో చేస్తున్నారని, వ్యాపారులను బెదిరించి అందిన కాడికి దండుకొని వస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి.

23 కిలోల బియ్యం..25 కిలోలకు బిల్లు...

నిత్యావసర వస్తువుల్లో బియ్యం విక్రయాల్లో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. నగరంలో 100కు పైగానే బియ్యం దుకాణాలు ఉన్నాయి. 25 కిలోల బస్తా బియ్యం అని చెప్పి విక్రయిస్తున్నారు. కానీ బస్తాలో 23 కేజీలో బియ్యం మాత్రమే ఉంటున్నాయి. బస్తాకు రెండు కిలోల చొప్పున రూ.120 మేర నష్టపోతున్నారు. కందిపప్పు, మినప్పప్పు, పెసర పప్పు లాంటి నిత్యావసర వస్తువుల మీద కనీసం కిలోకు 100 గ్రాముల తేడా ఉంటోంది. ఒకవేళ తూకం బాగున్నా నాణ్యతలో లోపం కనిపిస్తుందని మహిళలు చెబుతున్నారు.

మార్ట్‌లలో కూడా ఇదే తంతు..

నగరంలో మూడు బడా మార్ట్‌లు ఉన్నాయి. ఇక చిన్న చిన్న మార్ట్‌లు అనేకం ఉన్నాయి. ఇక్కడ కూడా తూకం మోసాలు ఎక్కువగా జరుగుతున్నట్లు ప్రచారం సాగుతోంది. నగరంలో ఎప్పుడూ కిటకిటలాడే ఒక మార్ట్‌లో సరుకుల నాణ్యతతో పాటుగా తూకంపై అనేక కథనాలు ప్రచారంలో ఉన్నాయి. నిత్యం ఆఫర్ రేట్లకు సరుకులను, ఇతర ఫ్యాన్సీ, వస్త్రాలను విక్రయించే సదరు మార్ట్‌లో నిత్యావసర వస్తువుల తూకంలో 100 నుంచి 200 గ్రాముల వరకు తక్కువగా వస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. నిత్యావసర వస్తువులన్నీ అర్ధకిలో, కిలో, ప్యాకెట్లలో విక్రయిస్తున్నారు. ఇంటికి వెళ్లి తూకం వేస్తే 50 గ్రాముల వరకూ తేడాలు వస్తున్నాయి. నిత్యావసర వస్తువుల ప్యాకింగ్‌పై ధర, తయారీ తేదీ, కంపెనీ పేరు, టోల్ ఫ్రీ నంబర్, పరిమాణం నమోదు చేయకుండానే విక్రయిస్తున్నారు. వీటినికొని వినియోగదారులు మోసపోతున్నారు. సినిమా థియేటర్లలో కొత్త సినిమా రిలీజ్ అయితే బహిరంగంగానే ప్రేక్షకుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తున్నారు.



చికెన్, మటన్ దుకాణాల్లో కాటా మాయ...

నగరంలో 150 పైగా చికెన్ దుకాణాలు ఉన్నాయి. ఏ చికెన్ దుకాణంలో చూసినా వేయింగ్ మిషన్ సక్రమంగా లేదు. తూకంలో కూడా చాలా తేడాలు ఉన్నాయి. అందుకే ఇక్కడ మార్కెట్లో ఒక్కో దుకాణంలో ఒక్కో రేటుకు చికెన్ విక్రయిస్తున్నారు. తక్కువ ధరకు చికెన్ విక్రయించే దుకాణాల్లో, కొన్ని మటన్ దుకాణాల్లో తూకం మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కిలోకు చికెన్ 150 గ్రాముల వరకు తక్కువ వస్తుంది. మటన్ 100 గ్రాములకు పైగానే తక్కువగా ఉంటుందని వినియోగదారులు వాపోతున్నారు. ఒక్కో చోట 200 గ్రాములకు పైగా తక్కువ తూకం ఉంటోంది. చేపల మార్కెట్లో తూకం విధానం నామమాత్రంగా కొనసాగుతుంది. కడిగే సమయంలో వినియోగదారుల కళ్లుగప్పి కొన్ని ముక్కల్ని మాయం చేస్తున్నారు. దాంతో వినియోగదారులు కనీసం రూ.50 నుంచి రూ.100 వరకు మోసపోతున్నాడు. నగరంలో రోజుకు మూడు వేల కిలోలకు పైగా చికెన్ విక్రయాలు జరుగుతుండగా రూ.60 వేల వరకు తూకం మోసాల వలన వినియోగదారులు నష్టపోతున్నారు. మటన్‌లో రూ.20 వేలు, చేపల్లో మరో రూ.30 వేలకు పైగా నష్టపోతున్నట్లు అంచనా.



జిల్లా వినియోగదారుల కమిషన్ పరిష్కరించిన కేసు

చీరాలకు చెందిన వలేటి రామచంద్రరావు ఎస్‌బీఐ జనరల్ ఇన్‌స్రూ ఓవర్‌సీస్ ట్రావెల్ హెల్త్ పాలసీ రూ.50 వేల డాలర్లకు రూ.34,928 ప్రీమియం చెల్లించి తీసుకున్నారు. అనంతరం ఆయన అమెరికాలో ఉంటున్న తన కుమార్తె వద్దకు వెళ్లారు. అక్కడ ఆయన గుండెజబ్బుకు గురికావడంతో ఆయన స్టంట్ వేయించుకున్నారు. దీనిపై వైద్య ఖర్చులను చెల్లించాలని ఆయన బీమా కంపెనీని కోరితే వారు పాలసీ తీసుకునే సమయంలో బీపీ ఉన్నట్లు తెలియజేయలేదంటూ నిరాకరించారు. దీనిపై ఆయన ఇండియా వచ్చిన తరువాత జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదుచేయగా కమిషన్ అధ్యక్షులు డి.శ్రీదేవి, సభ్యులు వై.సుందరరావు, డాక్టర్ ఎస్‌ఏ సమీరా ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ఫిర్యాదికి రూ.41,41,700 (బీమా మొత్తానికి సమానం) ను 6 శాతం వడ్డీతో బీమా కంపెనీ ఫిర్యాదును తిరిస్కరించినప్పటి నుంచి తిరిగి కమిషన్ ఆర్డర్‌ను అమలు చేసే వరకు చెల్లించాలని, మానసికమైన ఆందోళనకు రూ.20 వేలు, కోర్టు ఖర్చులు రూ.5 వేలు చెల్లించాలని ఆదేశించారు.

బంగారం కొనాలంటే భయపడిపోతున్న జనం...

నగరంలో 120 బంగారు దుకాణాలు ఉన్నాయి. బంగారు పనులు చేసే వారు 200 మంది వరకు ఉన్నారు. ఇవి కాకుండా మరో 6 బడా జ్యూయలరీ షోరూంలు ఉన్నాయి. అయితే ఇక్కడ బంగారం కొనుగోలు చేయాలంటే వినియోగదారులు భయపడిపోతున్నారు. రేటు విషయంలో పెద్దగా సందేహాలు లేకపోయినా నాణ్యత విషయంలో సందేహాలు తొలచివేస్తున్నాయి. అసలు ఏదో, నకిలీ ఏదో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంలో తరచుగా బంగారు దుకాణాల వద్ద ఘర్షణలు జరుగుతున్నాయి. నగరంలో 10 గ్రాముల బంగారం నగ చేయాలంటే అందులో 10 శాతం తరుగు, లేబర్ చార్జీలు వసూలు చేస్తున్నారు. కొందరు 5 శాతం లేబర్ తీసుకొని పనులు చేస్తున్నారు.

12 నెలలు 202 కేసులు...

జిల్లాలో తూనికలు, కొలతల శాఖను మూడు రెవెన్యూ డివిజన్లుగా విభజించారు. ఒంగోలు రెవెన్యూ డివిజన్ పరిధిలో 9 మండలాలు ఉన్నాయి. మార్కాపురం పరిధిలో 13 మండలాలు, పొదిలి పరిధిలో 16 మండలాలు ఉన్నాయి. 2024 ఏప్రిల్ నుంచి 2025 ఫిబ్రవరి వరకు ఒంగోలు డివిజన్లోని 9 మండలాల్లో తూనికలు కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహించి 202 కేసులు నమోదు చేశారు. ఇందులో తూనికరాళ్లకు సంబంధించి 84 కేసులు ఉండగా రేటు, డేటు, మ్యానిఫ్యాక్చరింగ్, కస్టమర్ కేర్‌కు సంబంధించి 118 కేసులు నమోదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. నిజానికి ఒక్క ఒంగోలు నగరంలో వెయ్యికిపైగా చిల్లర కొట్లు ఉన్నాయి. 500 వరకు ఫ్యాన్సీ షాపులు ఉన్నాయి. దాదాపుగా అన్ని దుకాణాల్లో డిజిటల్ మెషిన్లు వచ్చాయి. కొన్ని దుకాణాల్లో డిజిటల్ మిషన్లలో చిప్ ఏర్పాటు చేసుకొని తక్కువ తూకంతో నిత్యావసర వస్తువులు విక్రయిస్తున్నట్లు సమాచారం.

వినియోగదారులకు రక్షణ చట్టాలున్నాయి



ప్రభుత్వం వినియోగదారులకు రక్షణ కల్పించేందుకు అనేక చట్టాలు చేసింది. వినియోగదారులను మోసం చేసినా, వస్తువులను కల్తీచేసి అమ్మినా వెంటనే జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చు. తెల్లరేషన్ కార్డుదారులు ఎటువంటి ఫీజు లేకుండా ఫిర్యాదు చేయవచ్చు. 2019 కన్జ్యూమర్ యాక్టు వినియోగదారులకు రక్షణ కల్పిస్తుంది. ప్రభుత్వం ఫుడ్ కమిటీలను, మండల స్థాయిలో కన్జ్యూమర్ ఫోరాలను ఏర్పాటుచేసి ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలి.

– ఓఎ మల్లిక్, జిల్లా వినియోగదారుల సంఘం గౌరవ అధ్యక్షుడు, మార్కాపురం

వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించడం ఇలా..

ఒంగోలు: జిల్లా వినియోగదారుల కమిషన్ స్థానిక లాయరుపేటలోని ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పక్కన ఉంది. ఇందులో ఒక అధ్యక్షుడు, మరో ఇద్దరు సభ్యులు ఉంటారు. వారు తమ వద్దకు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి ఆర్డర్లు జారీ చేస్తారు. ఎవరైనా వినియోగదారుడు వస్తులోపం లేదా సేవాలోపానికి గురయ్యానని భావించినప్పుడు అతను వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయవచ్చు. కేవలం తెల్లకాగితంపై ఫిర్యాదును రాయడంతోపాటు దానిని నిరూపించే ఆధారాలకు తగిన పత్రాలు, ఆధార్‌కార్డును జత చేయడం ద్వారా రూ. 5 లక్షల లోపు వస్తు సేవలకు ఉచితంగా కేసు నమోదవుతుంది. రూ.5 లక్షలకు మించి రూ.10 లక్షల వరకు రూ.200 ఫీజు, రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రూ.400 ఫీజు, రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వెయ్యి రూపాయల ఫీజును చెల్లించాలి. ఈ కమిషన్‌లో కేసును అడ్వకేట్‌తో పనిలేకుండా నడుపుకునే సౌలభ్యం ఉంటుంది. అవసరమైతే అడ్వకేట్ ద్వారా కూడా కేసు నమోదుచేసుకోవచ్చు. ఎవరైనా ఉద్యోగి అయి ఉండి కోర్టును నేరుగా సంప్రదించలేనివారు నేషనల్ కన్జ్యూమర్ హెల్ప్ లైన్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు. ఇందుకు ఫోన్‌కాల్‌లోనే కమిషన్ ఉద్యోగులు ఫిర్యాదును స్వీకరించడంతోపాటు చిన్న చిన్న కేసులను అవతలి వ్యక్తులకు సమాచారం పంపి ప్రాథమిక దశలోనే వాటిని పరిష్కరించేందుకు అవకాశం ఉంటుంది. ప్రతివాదులు స్పందించని పక్షంలో కేసు నమోదుచేసి 5 నెలల్లో పరిష్కారం చేసేందుకు చొరవ చూపుతారు. అదే విధంగా ఆన్‌లైన్ ద్వారా జరిగే కొన్ని మోసాలను గుర్తించేందుకు కేంద్ర వినియోగదారుల మంత్రిత్వశాఖ ''జాగో గ్రాహక్ జాగో'' అనే యాప్‌ను రూపొందించింది. దీని ద్వారా ఏదైనా వస్తువులను కొనుగోలుచేసే సమయంలో ఆ వెబ్‌సైట్ నకిలీదో కాదో కూడా వినియోగదారునికి తెలియజేస్తుంది. మరో వైపు వినియోగదారుడైన కమిషన్‌లో నమోదైన తమ కేసు వివరాలను తెలుసుకునేందుకు ఈ జాగృతి యాప్‌ను రూపొందించింది. దీనివల్ల కమిషన్‌ను సంప్రదించకుండానే తమ కేసు స్థితి ఏమిటో తెలుసుకోగలుగుతారు. వినియోగదారునిలో చైతన్యం తీసుకువచ్చేందుకు, వారి హక్కుల పరిరక్షణకు ఏటా మార్చి 15న ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవం జరుపుకుంటున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది ''సుస్థిర జీవన శైలికి న్యాయమైన పరివర్తన'' అనే ఉద్దేశాన్ని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది.

ఫిర్యాదుపై అప్పీలుకు అవకాశం



2019 చట్టం అమలులోకి వచ్చిన తరువాత స్థానిక ఫోరం నుంచి కూడా ఫిర్యాదు చేసే సౌలభ్యం కల్పించారు. దీంతో కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. జిల్లా వినియోగదారుల కమిషన్ ఇచ్చిన ఉత్తర్వుల పట్ల సంతృప్తి చెందని వారు రాష్ట్ర,జాతీయ వినియోగదారుల ఫోరాలను ఆశ్రయించవచ్చు. తీర్పును నిర్లక్ష్యం చేస్తే ఉత్తర్వులు వెలువడిన 45 రోజుల తరువాత నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీచేసి కనీసంగా ఒకనెలకు తగ్గకుండా గరిష్ఠంగా 3 సంవత్సరాల వరకు జైలుశిక్ష లేదా రూ.25 వేలకు తగ్గకుండా లక్ష రూపాయల వరకు జరిమానా లేదా జైలుశిక్ష కూడా వినియోగదారుల కమిషన్ విధించే అవకాశం ఉంది.

– డాక్టర్ ఎస్ఏ సమీరా, వినియోగదారుల కమిషన్ జిల్లా సభ్యురాలు

డిజిటల్ వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలి



డిజిటల్ వ్యవస్థపై యువత అవగాహన పెంచుకోవాలి. సైబర్ నేరం జరిగిన 24 గంటల్లోపు 1930కి ఫిర్యాదు చేస్తే నష్టాన్ని తిరిగి భర్తీ చేసుకునే సౌలభ్యం ఉంది. ఒక వేళ ఏదైనా సమాచారం సంపూర్ణంగా వివరించాలనుకుంటే వాట్సప్ నంబర్ 8800001915కి ద్వారా ఫిర్యాదు పంపుకోవచ్చు. ఈ కామర్స్ వ్యవస్థలకు సంబంధించి నేషనల్ హెల్ప్‌లైన్ 1800114000ను సంప్రదించవచ్చు. సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ ద్వారా మిస్ లీడింగ్ అడ్వర్టయిజింగ్‌లపై కూడా వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. జిల్లా స్థాయిలో వినియోగదారుల సమాచార కేంద్రాన్ని కూడా సంప్రదించి తమ సమస్యకు పరిష్కార మార్గాన్ని పొందేందుకు సౌలభ్యం ఉంది.

– మాగులూరి నాగేశ్వరరావు, వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర చైర్మన్

ఎమ్మెల్యే విజయకుమార్‌కు అవమానం

- టీడీపీలో బయటపడిన విభేదాలు
- కలెక్టరేట్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ శిలా ఫలకంపై ఎమ్మెల్యే బీఎన్ పేరు వేయకుండా ప్రొటోకాల్ ఉల్లంఘన
- బీఎన్ ఫొటో లేకుండా ఫ్లెక్సీ ఏర్పాటు
- సభలో పాల్గొనకుండా వెళ్లిపోయిన బీఎన్ విజయకుమార్

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన బాబా సాహెబ్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ సభలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్‌కు అవమానం జరిగింది. విగ్రహావిష్కరణకు వచ్చిన ఆయన మనస్తాపంతో సభలో పాల్గొనకుండా వెళ్లిపోయారు. దాంతో సంతనూతలపాడు టీడీపీ నాయకులు, కార్యకర్తలు మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగానే మా ఎమ్మెల్యేను అవమానపరిచారంటూ సభాప్రాంగణంలో నిర్వాహకులతో వాదనకు దిగారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ దళిత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం డాక్టర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ జరిగింది. ఈ ఆవిష్కరణకు రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్‌లను నిర్వాహకులు ఆహ్వానించారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమంలో ప్రారంభమవుతుందని ప్రకటించారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయకుమార్ సరిగ్గా 10.30 గంటల కల్లా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అర్ధగంట వేచి ఉన్న తరువాత మంత్రి స్వామి వచ్చారు. అప్పటికే అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అక్కడకు వచ్చారు. అయినా కార్యక్రమాన్ని ప్రారంభించలేదు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. చేసేదేమీ లేక మంత్రి స్వామి, ఎమ్మెల్యే విజయకుమార్ సభా ప్రాంగణంలోనే పడిగాపులు కాశారు. సుమారు గంటకు పైగా ఆలస్యంగా ఎమ్మెల్యే దామచర్ల సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఆయన వచ్చీ రాగానే అధికారులు, నిర్వాహకులు హడావుడి చేశారు. ముగ్గురు అతిథుల చేత అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేయించారు. అప్పటి వరకు విగ్రహానికి వేసి ఉన్న కర్టెన్ తొలగిపోవడంతో శిలాఫలకం బయటపడింది. అందులో ప్రొటోకాల్ ప్రకారం సంతనూతలపాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ పేరు లేదు. విగ్రహావిష్కరణకు సంబంధించి ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలలో కూడా ఆయన ఫొటో లేదు. దాంతో ఎమ్మెల్యే బీఎన్ అవమానంగా భావించారు. అనంతరం సభ ప్రారంభమైంది. ఇక్కడ కూడా నిర్వాహకులు ప్రొటోకాల్ పాటించలేదు. మంత్రి స్వామి, ఎమ్మెల్యే దామచర్ల, నగర మేయర్ తదితరులను వేదిక మీదకు పిలిచిన తరువాత చివరిగా ఎమ్మెల్యే విజయకుమార్‌ను వేదిక మీదకు పిలిచారు. దాంతో ఆయన మరింత అవమానంగా భావించారు. వేదిక మీదకు ఎక్కకుండా వెళ్లిపోయారు. ఇది గమనించిన సంతనూతలపాడు టీడీపీ కార్యకర్తలు, దళిత సంఘాల నాయకులు ఆగ్రహానికి గురయ్యారు. కావాలనే మా ఎమ్మెల్యేను అవమానించారంటూ గొడవకు దిగారు. సభకు హాజరుకాని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్సీల పేర్లను శిలాఫలం మీద వేసి మా ఎమ్మెల్యే పేరు ఎందుకు వేయలేదని నిలదీశారు. రాత్రికి రాత్రి శిలాఫలకం తొలగించి కొత్త శిలాఫలకం వేయించాలని, అప్పటి వరకు ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఒక దళిత ఎమ్మెల్యేను దళిత ఉద్యోగ సంఘాలే అవమానించడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గట్టిగా కేకలు వేస్తూ వాదనకు దిగడంతో కాసేపు ఉద్రిక్తంగా మారింది. ఈ లోపు నిర్వాహకులు అక్కడ నుంచి వెళ్లిపోయారు.



ఎమ్మెల్యే విజయకుమార్ పేరు లేకుండా ఏర్పాటు చేసిన శిలాఫలకం

దామచర్ల పాత్రపై అనుమానాలు:

అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకం మీద సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పేరు ముద్రించకపోవడంతో జిల్లా అధికార పార్టీలోని విభేదాలు మరోసారి రచ్చకెక్కినట్టయింది. ఉప్పుగుండూరు రేషన్ బియ్యం పట్టివేత వ్యవహారంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు, బీఎన్ విజయకుమార్‌కు మధ్య విభేదాలు వచ్చాయన్న ప్రచారం జరిగింది. అప్పటి నుంచి దామచర్ల వర్గం లోలోపల ఉడికిపోతున్నారని సంతనూతలపాడు దళిత సామాజికవర్గానికి చెందిన టీడీపీ కార్యకర్తలు చెబుతున్నారు. ఇప్పుడు ఉద్దేశపూర్వకంగానే ఎమ్మెల్యే విజయకుమార్ పేరు శిలాఫలకం మీద ముద్రించకుండా చేసి ప్రతీకారం తీర్చుకున్నారని చెబుతున్నారు. ఏదైనా పొరపాటు జరిగిందని చెప్పడానికి వీలులేకుండా ఫ్లెక్సీల మీద కూడా ఆయన ఫొటోలు లేకుండా చేశారని మండిపడ్డారు. ఎమ్మెల్యే దామచర్ల ఒత్తిడితోనే డీఆర్ఓ చినఓబులేశు ఈ కుట్రకు తెరతీశారని విమర్శలు గుప్పిస్తున్నారు.

రాయితీపై యంత్ర పరికరాలు

- 1700 మంది రైతులకు రూ.279.64 లక్షల కేటాయింపు

ఒంగోలు సబర్బన్: జిల్లాలోని రైతులకు రాయితీపై వ్యక్తిగతంగా వ్యవసాయ యంత్ర పరికరాలు అందించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో సుమారు 1700 మందికి రాయితీపై యంత్ర పరికరాలు అందించేందుదుకు రూ.279.64 లక్షలు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఈ పథకం కింద ట్రాక్టరుతో నడిచే వ్యవసాయ పనిముట్లు గొర్రు, నాగళ్లు, రోటోవేటర్, బ్లేడు, సీడ్ డ్రిల్స్, స్వీయ చోదక పనిముట్లు అంటే పవర్ వీడర్లు, బ్రష్ కట్టర్లు, పవర్ టిల్లర్‌లు, పురుగుమందులు పిచికారి చేసే స్ప్రేయర్లు (బ్యాటరీ, తైవాన్) లాంటివి అర్హులైన రైతులకు రాయితీపై సరఫరా చేస్తారన్నారు. ఈ పథకం కింద లబ్ధిపొందటానికి చిన్న, సన్నకారు రైతులు మాత్రమే అర్హులని, గత మూడు సంవత్సరాల్లో ఏదో ఒక సీజన్‌లో ఈ–పంట నమోదు చేసుకొని ఉండాలన్నారు. గత ఐదు సంవత్సరాల్లో ప్రభుత్వ పథకాల కింద వ్యక్తిగతంగా కానీ, సీహెచ్‌సీ ద్వారా కానీ వ్యవసాయ పనిముట్లు తీసుకోకుండా ఉండే రైతులు మాత్రమే ఈ పథకానికి అర్హులని వివరించారు. ఒక కుటుంబంలోని ఒక వ్యక్తికి మాత్రమే వ్యవసాయ పనిముట్లు ఇస్తారన్నారు. ఆ రైతు కచ్చితంగా వెబ్‌ల్యాండ్ లేదా ఆర్‌ఓఆర్‌లో నమోదై ఉండాలన్నారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం నకళ్లు, ట్రాక్టరు రిజిస్ట్రేషన్ పత్రాలు, ఎస్సీ, ఎస్టీ రైతులు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకొని సంబంధిత రైతు సేవా కేంద్రాలకు వచ్చి సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

చైన్‌స్నాచర్ అరెస్టు

- 30 గ్రాముల బంగారు నరుడు రికవరీ
- పలువురు సిబ్బందికి రివార్డులు అందజేసిన సీఐ



రికవరి చేసిన సొత్తు, నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

కంభం: మహిళ మెడలో గొలుసు అపహరించిన నిందితుడిని కంభం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వివరాలను కంభం సీఐ కె.మల్లికార్జున శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. ఈ నెల 11వ తేదీ ఉదయం రైల్వే స్టేషన్ సమీపంలో నివాసం ఉంటున్న మందా హుస్సేనమ్మ నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా నెహ్రూనగర్ 6వ లైను సమీపంలో ఆమె మెడలోని బంగారు సరుడును ఓ యువకుడు లాక్కుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ముండ్లపాడుకు చెందిన షేక్ సలీంను నిందితుడిగా గుర్తించారు. గురువారం సాయంత్రం రావిపాడు రోడ్డులో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. బెట్టింగ్‌లు, ఇతర చెడు వ్యసనాలకు బానిసైన సలీం డబ్బు కోసం దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో అంగీకరించాడు. నిందితుడి నుంచి 30 గ్రాముల బంగారు సరుడు, తాళిబొట్టు స్వాధీనం చేసుకున్నామని, దాని విలువ రూ.2,40,000 ఉంటుందని సీఐ వివరించారు. కాగా దొంగను అరెస్టు చేసేందుకు కృషి చేసిన కానిస్టేబుళ్లు బషీర్, రమేష్, మహబూబ్ సుభాని, పీరయ్య, శివ, హోంగార్డ్ ఖాదర్‌ను ఎస్పీ అభినందించారు. ఆయన సూచన మేరకు సీఐ రివార్డులు అందజేశారు.

విచారణకు హాజరుకాని నాయక్

ఒంగోలు టౌన్: మాజీ పార్లమెంట్ సభ్యుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ రాజు కస్టోడియల్ విచారణపై నమోదైన కేసులో విచారణ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఒంగోలు ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను విచారణాధికారిగా నియమించిన తర్వాత ఏసీబీ ఏఎస్పీ విజయపాల్, గుడివాడ టీడీపీ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బంధువు తులసిబాబును అరెస్టు చేశారు. ఈ క్రమంలో బీహార్ కేడర్ ఐపీఎస్ అధికారి సునిల్ నాయక్‌ను విచారణకు హాజరు కావాలని జనవరి 3న పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఆయన స్పందించకపోవడంతో ఈ నెల 14 నుంచి 22వ తేదీలోగా విచారణకు హాజరుకావాలని రెండోసారి నోటీసులు పంపారు. శుక్రవారం ఆయన విచారణకు వస్తారేమోనని పోలీసులు ఎదురుచూశారు. 22వ తేదీ వరకు గడువు ఉన్న నేపథ్యంలో వేచి చూడక తప్పని పరిస్థితి ఏర్పడింది.









పోలీస్ కార్యాలయంలో హోలీ సంబరాల్లో ఎస్పీ దామోదర్

సంబరాల కేళి

హోలీ పర్వదినం సందర్భంగా యువత సంబరాల్లో మునిగి తేలింది. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో పోలీసుల పిల్లలు, సిబ్బంది సందడి చేశారు. ఎస్పీ ఏఆర్ దామోదర్, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు. హోలీ సందర్భంగా ఒంగోలులో ప్రైవేట్‌గా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమం యువతను ఊర్రూతలూగించింది. - సాక్షి, ఒంగోలు



విజయసాయిరెడ్డివి నీచ రాజకీయాలు

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చుండూరు రవిబాబు, పక్కన కేవీ రమణారెడ్డి, ఇతర నాయకులు

ఒంగోలు సిటీ: విజయసాయిరెడ్డివి హీన రాజకీయాలని, ఆయన చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక పథకం ప్రకారమే వైఎస్సార్ సీపీపై, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ అధినేతగా కులాలకు అతీతంగా వైఎస్ జగన్ పనిచేస్తుంటే.. పార్టీలో ఉన్న సమయంలో కుల రాజకీయాలు చేసిందే విజయసాయిరెడ్డి అని ధ్వజమెత్తారు. పార్టీని అడ్డం పెట్టుకుని రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగి అడ్డగోలు ఆరోపణ చేయడం సరికాదన్నారు. ఎంతో నమ్మకంగా పార్టీ ఉత్తరాంధ్ర బాధ్యతలు అప్పగిస్తే అక్కడ ఆయన చేసిన నిర్వాకం వల్ల పార్టీ భారీగా దెబ్బతిందని విమర్శించారు. విజయసాయిరెడ్డి చేస్తున్న తప్పులను గుర్తించి ఉత్తరాంధ్ర బాధ్యతల నుంచి తొలగించిన తర్వాతే ఒక ప్రణాళిక ప్రకారం ఆయన ఆరోపణలు చేయడం మొదలుపెట్టారన్నారు. ఢిల్లీలో లాబీయింగ్‌కు అలవాటుపడిన విజయసాయిరెడ్డి అధికారం లేని వైఎస్సార్ సీపీలో ఉండలేక వెళ్లిపోయాడని ఎద్దేవా చేశారు. విజయసాయిరెడ్డి బీజేపీతో అంటకాగాలనో, చంద్రబాబు భయం వలనో అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డిపై చేస్తున్న ఆరోపణలు సత్యదూరమన్నారు. అనవసరంగా వారిని వివాదాల్లోకి లాగి అక్కసు తీర్చుకుంటున్నారన్నారు. ఢిల్లీలో తన లాబీయింగ్‌కు అడ్డువస్తారనే ఉద్దేశంతో వై.వి.సుబ్బారెడ్డిని రాజకీయంగా ఎదగకుండా చేశారన్నారు. వై.వి.సుబ్బారెడ్డి ఒంగోలు ఎంపీగా ఉన్న సమయంలో జిల్లాకు కేంద్రీయ విద్యాలయం, అండర్‌పాస్‌లు, స్టాపింగ్ లేని స్టేషన్లలో పలు రైళ్లకు స్టాపింగ్ ఏర్పాటు వంటి పనులను ప్రతిపక్షంలో ఉండి కూడా చేశారన్నారు. గతంలో ఎవరూ చేయలేనన్ని పనులు వై.వీ.సుబ్బారెడ్డి చేశారని గుర్తు చేశారు. పార్టీ అధికారంలో ఉన్న సమయంలో కూడా ఆయన ఎంపీగా ఉండి ఉంటే ప్రకాశం జిల్లా దశ మారిపోయేదని, ఈ పాటికి పారిశ్రామిక వాడ, ఎయిర్‌పోర్టు, వెలిగొండ ప్రాజెక్టుకు నీళ్లు వచ్చేవని అన్నారు. విజయసాయిరెడ్డి కుట్రలు చేసి వై.వి.సుబ్బారెడ్డిని పక్కన పెట్టించారన్నారు. విజయసాయిరెడ్డి లాంటి వ్యక్తి పార్టీని వదిలిపెట్టి వెళ్లడం శుభపరిణామమన్నారు.

విజయసాయిరెడ్డి వెన్నుపోటు పొడిచారు : కె.వి.రమణారెడ్డి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీకి వెన్నుపోటు పొడిచిన నీచమైన సంస్కృతి విజయసాయిరెడ్డిదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి మండిపడ్డారు. విజయసాయి చెప్పినట్టు వైఎస్సార్ సీపీకి, వైఎస్ జగన్‌కు కోటరీ లేదని, కానీ కోటరీ పేరుతో విజయసాయిరెడ్డి పెత్తనం చలాయించారని దుయ్యబట్టారు. వ్యక్తిగత స్వార్థంతో వైఎస్సార్ సీపీని వీడిన ఆయన కూటమి నేతలను మెప్పించడానికి అసత్య ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నష్టం కలిగించే చర్యలు విజయసాయిరెడ్డి మానుకోవాలన్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలిచి రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయి ఉంటే విజయసాయిరెడ్డి పార్టీని వదిలివెళ్లిపోయేవారా, ఇటువంటి విమర్శలు చేసేవారా అని ప్రశ్నించారు. రాజకీయాల నుంచి తప్పుకున్నానని చెప్పిన విజయసాయిరెడ్డి నీచ రాజకీయాలు చేయకుండా శేషజీవితాన్ని ప్రశాంతంగా గడపాలని, ఆయన చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కె.వి.రమణారెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు పదవులు అనుభవించిన విజయసాయిరెడ్డి.. అధికారంలో లేనప్పుడు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. విజయసాయిరెడ్డి చేసిన ఆరోపణలు వెనక్కు తీసుకోవాలని, లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వెంకట ప్రసాద్, రాష్ట్ర మహిళా కార్యదర్శి భూమిరెడ్డి రమణమ్మ, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఇమ్రాన్‌ఖాన్, ప్రవీణ్‌కుమార్, నాయకులు వై.వెంకటేశ్వరరావు, పత్రా ఐజాక్, షేక్ మీరావలి, జి.రజిని, దేవా, శ్రీకాంత్, పిగిలి శ్రీనివాసులు, ఏడుకొండలు, పి.వెంకయ్యనాయుడు, కయూమ్, తదితరులు పాల్గొన్నారు.

చింతిస్తున్నాం.. మన్నించండి!

- మృతి చెందిన పింఛనుదారు కుటుంబానికి ఉద్యోగుల పరామర్శ

సాక్షి ఎఫెక్ట్..



మంగమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సచివాలయ ఉద్యోగులు

పొన్నలూరు: పొన్నలూరు మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన పిల్లి మంగమ్మ 12 ఏళ్లుగా వితంతు పింఛన్ తీసుకుంటోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కూడా ఎలాంటి ఆటంకం లేకుండా వలంటీర్లు ప్రతి నెలా ఇంటికి పింఛను నగదు అందించేవారు. అయితే ఈ నెలలో మంగమ్మకు వేలిముద్రలు, ఐరిస్ పడలేదంటూ స్థానిక సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ పింఛను నగదు ఇవ్వలేదు. ఆర్‌బీఐఎస్ పద్ధతిలో వెల్ఫేర్ అసిస్టెంట్ పింఛను ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ పట్టించుకోలేదు. దీంతో మనోవేదనకు గురైన మంగమ్మ గురువారం ప్రాణాలు విడిచింది. ఈ విషయమై శుక్రవారం 'పింఛన్ రాలేదన్న ఆందోళనతో ప్రాణాలు విడిచింది' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఉన్నతాధికారులు స్పందించారు. మంగమ్మ గృహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడాలని వెటర్నరీ అసిస్టెంట్ నారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ హరిని ఆదేశించారు. దీంతో వీరిద్దరూ శుక్రవారం కొత్తపాలెంలోని మంగమ్మ కుటుంబ సభ్యులతో మాట్లాడారు. జరిగిన పొరపాటుకు చింతిస్తున్నామని, తమను మన్నించాలని కోరారు. కాగా ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం చెప్పారు.

గ్రంథాలయ ఉద్యోగుల సంఘ నూతన కమిటీ ఎంపిక



జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన శ్రీధర్‌రెడ్డికి పత్రాలు అందజేస్తున్న రాష్ట్ర నాయకులు

ఒంగోలు టౌన్: జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన నూతన కమిటీ ఎన్నికల్లో అధ్యక్షునిగా కె.శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.సంజయ్‌బాబు, ఉపాధ్యక్షునిగా బి.శేఖర్, సహాయ కార్యదర్శిగా సీహెచ్ అజయ్‌బాబు, కోశాధికారిగా వెంకటేశ్వర్లు, సభ్యులుగా డి.సందీప్, జి.రామాంజి నాయక్, రోహిణి, అనిల్ ఎంపికయ్యారు. ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ జుల్ఫీకర్ అలీ పరిశీలించగా, ఎన్నికల నిర్వహణాధికారిగా పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంఘ ఉపాధ్యక్షుడు పామర్తి రంగారావు వ్యవహరించారు.

దేవాలయాల్లో రెచ్చిపోయిన దొంగలు

- ఒకేరోజు రెండు గ్రామాల్లోని నాలుగు ఆలయాల్లో చోరీ
- రూ.లక్ష నగదు, 14 తులాల బంగారం, అరకిలోకిపైగా వెండి ఆభరణాల అపహరణ
- అర్ధరాత్రి కరెంటు కట్ చేసి మరీ దొంగతనం
- సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి హార్డ్ డిస్క్‌లు తొలగించిన వైనం



జమ్మలమడకలో దొంగతనం జరిగిన శివాలయం



దొంగలు పగులగొట్టిన శివాలయం హుండీ



డాగ్ స్క్వాడ్‌తో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

దర్శి (ముండ్లమూరు): దేవాలయాలపై దొంగలు విరుచుకుపడ్డారు. ఏకంగా ఒకేరోజు రెండు గ్రామాల్లోని నాలుగు ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డారు. సీసీ కెమెరాలను సైతం పాడుచేసి పోలీసులకు సవాల్ విసిరారు. ముండ్లమూరు మండలంలో జరిగిన ఈ సంఘటనల వివరాల్లోకెళ్తే.. మండలంలోని జమ్మలమడక గ్రామంలో ఉన్న శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో, బొప్పూడివారిపాలెం గ్రామంలోని భక్తాంజనేయస్వామి, పోలేరమ్మతల్లి ఆలయాల్లో గురువారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. జమ్మలమడకలో అమ్మవారి పది తులాల బంగారు మంగళసూత్రం, అర కిలో వెండి ఉత్సవ మూర్తి, కిరీటం, తొడుగులు, ఇతర ఇత్తడి వస్తువులు, ఉత్సవమూర్తికి చెందిన రెండు తులాల బంగారు తాళిబొట్టు, రెండు తులాల బంగారు ముక్కుపుడక, శివాలయం హుండీ పగులగొట్టి అందులో ఉన్న సుమారు రూ.40 వేల నగదు, ఆంజనేయస్వామి గుడిలో హుండీ పగులగొట్టి అందులో ఉన్న సుమారు రూ.10 వేల నగదు దోచుకెళ్లారు. బొప్పూడివారిపాలెంలో భక్తాంజనేయస్వామి, పోలేరమ్మ తల్లి ఆలయాల్లో రెండు హుండీలు పగులగొట్టి రూ.50 వేల నగదు దోచుకెళ్లారు. సంవత్సరం క్రితం రెండు కోట్ల రూపాయలతో శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాన్ని భారీగా నిర్మించినట్లు గ్రామస్తులు, పూజారి కే కృష్ణప్రసాద్ తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి గ్రామంలో కరెంటు ఫ్యూజులు తీసి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఎక్కడో లైన్ కట్ అయి ఉంటుందనుకుని స్థానికులు లైన్‌మేన్‌కు ఫోన్ చేయడంతో గంట తర్వాత వచ్చి ఫ్యూజులు వేయడంతో కరెంటు వచ్చింది. ఈలోపే ఆలయాల్లో దొంగలు పడి అందినకాడికి దోచికెళ్లినట్లు అనుమానిస్తున్నారు. ముందుగా సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి వాటికి సంబంధించిన హార్డ్‌డిస్క్‌లు కూడా ఎత్తుకెళ్లారు. గ్రామంలో పోలీసులు పెట్టిన సీసీ కెమెరా కూడా ఎత్తుకెళ్లిన దొంగలు.. ఏకంగా పోలీసులకు సవాల్ విసిరారు. ఆ తర్వాత గుడిలోకి వెళ్లి గుడి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. లోపలున్న తాళిబొట్టు, ఉత్సవ విగ్రహాలతో పాటు హుండీ పగులగొట్టి అందులోని నగదు, ఇతర విలువైన సామగ్రి దోచుకెళ్లారు. బొప్పూడివారిపాలెం గ్రామంలోని సరిహద్దుల్లో గల భక్తాంజనేయస్వామి ఆలయం, పోలేరమ్మ ఆలయాల్లో కూడా తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లి హుండీలు పగులగొట్టి నగదు దోచుకెళ్లారు. గ్రామంలో పోలీసులు చందాలు వసూలు చేసి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కూడా దొంగలు ఎత్తుకెళ్లడం గమనార్హం. పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో ఘటన స్థలాలను పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇటీవల ముండ్లమూరులోని హోటల్లో రూ.10 వేల విలువైన అట్లపెండం, జేసీబీ తొండెంను దొంగలు ఎత్తుకెళ్లారు. గత బుధవారం రాత్రి గ్రామంలోని సెంటర్‌లో మోటారు సైకిల్ ఎత్తుకెళ్లారు. గతంలోనూ అధిక సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లను కూడా దొంగతనం చేశారు. వరుస దొంగతనాలతో ముండ్లమూరు మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు నిర్లక్ష్యం కారణంగానే దొంగతనాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు.

జనసేన కార్యకర్తల వీరంగం

- ట్యాక్స్ కట్టేది లేదంటూ టోల్ ప్లాజా సిబ్బందితో వాగ్వివాదం
- టంగుటూరులో అనుమతి లేకుండా రోడ్ మూసేసి భారీ స్క్రీన్



టంగుటూరు టోల్ ప్లాజా వద్ద హల్‌చల్ చేస్తున్న జనసైనికుడు



టంగుటూరు బొమ్మల సెంటర్లో దర్శనం ఇస్తున్న ఖాళీ కుర్చీలు

టంగుటూరు: జనసేన పార్టీ ఆవిర్భావ సభకు ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సులో వెళ్తున్న ఆ పార్టీ కార్యకర్తలు టంగుటూరు టోల్ ప్లాజా వద్ద గురువారం అర్ధరాత్రి వీరంగం చేశారు. మేము టోల్ ట్యాక్స్ కట్టం, గేటు తెరవండి, లేదంటే నీ అంతు చూస్తాం‹ అంటూ టోల్ ప్లాజా సిబ్బందిని బెదిరించారు. ×ఇప్పటి వరకు నాలుగు కార్లు, మూడు బస్సుల్లో వచ్చిన వారు ట్యాక్స్ కట్టే వెళ్లారు. మీరు కూడా అలాగే వెళ్లండని ధీటుగా జవాబివ్వడంతో జనసేన కార్యకర్తలు వితండవాదం చేశారు. చివరికి చేసేదేమీ లేక టోల్ ప్లాజా సిబ్బంది చెప్పినట్టుగా ట్యాక్స్ కట్టి వెళ్లారు. ఇదిలా ఉండగా పార్టీ ఆవిర్భావ వేడుకల ప్రత్యక్ష ప్రసారం పేరుతో శుక్రవారం టంగుటూరులోని బొమ్మల సెంటర్లో కొండపి రోడ్‌ను అనుమతి లేకుండా బ్లాక్ చేశారు. నడి రోడ్డుపై భారీ స్క్రీన్ ఏర్పాటు చేయడంతో అటు ప్రయాణికులు, ఇటు ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఇంత చేసినా అక్కడ ఖాళీ కుర్చీలు దర్శనమివ్వడంతో దారినవెళ్లేవారంతా నవ్వుకోవడం గమనార్హం.

బతుకుదెరువు కోసం వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన మేస్త్రీ
- మృతుడిది జరుగుమల్లి మండలం పాలేటిపాడు



మృతి చెందిన బంగారు బాబు



ఎంజీఎంలో చికిత్స పొందుతున్న శివమణి

సంగెం: బతుకుదెరువు కోసం వలస వచ్చిన ఓ భవననిర్మాణ కార్మికుడు రోడ్డు ప్రమాదంలో తనువు చాలించిన విషాద ఘటన వరంగల్ జిల్లా సంగెం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగురుమల్లి మండలం పాలేటిపాడు గ్రామానికి చెందిన కోయ బంగారుబాబు(34) తన భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలతో కలిసి పొట్టకూటి కోసం సంగెం మండల కేంద్రంలో కొన్నేళ్లుగా ఉంటూ.. భవన నిర్మాణ తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం తోటి మేస్త్రీ ఉలవపాడుకు చెందిన పులగర శివమణి అలియాస్ మణికంఠతో కలిసి పనినిమిత్తం తిమ్మాపూర్ గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి సంగెంకు వస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్ నుంచి నెక్కొండ వైపునకు అరటిగెలలు తీసుకొచ్చేందుకు ట్రేలతో అతివేగంగా వెళ్తున్న ట్రక్ సబ్‌స్టేషన్ సమీపంలో.. వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బంగారు బాబుకు కుడి చేయి, కాలుకు, శివమణికి కుడి చేయి, కుడికాలుకు గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో బంగారు బాబు మృతి చెందగా.. శివమణి చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఎంజీఎంలో పోస్టుమార్టం అనంతరం బంగారుబాబు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. కాగా, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ట్రక్ ఆగకుండా వెళ్లగా సీసీ ఫుటేజ్ ఆధారంగా ట్రేస్ చేశామని ఎస్సై తెలిపారు.

కమనీయంగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణం



కల్యాణ వేదికపై లక్ష్మీనృసింహస్వామి



కల్యాణానికి హాజరైన భక్తులు

మద్దిపూడి: పృథులగిరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి లక్ష్మీనృసింహస్వామి, రాజ్యలక్ష్మి అమ్మవారి కల్యాణం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కనుల పండువగా సాగింది. అర్చకులు నారాయణం ఆదిశేషాచార్యులు, నారాయణం మారుతీచార్యులు, నారాయణం శ్రీనివాసాచార్యులు, నారాయణం తిరుమలాచార్యులు, వేంకటసాయిచార్యులు కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వేల సంఖ్యలో భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించి, మొక్కులు చెల్లించారు. ముందుగా స్వామివారి గజోత్సవం మాఢ వీధుల్లో వేడుకగా సాగింది. బదూరి లక్ష్మీనృసింహశాస్త్రి, బదూరి మాణిక్యశాస్త్రి కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు. కాగా లక్ష్మీనృసింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.7,13,568 వచ్చినట్లు ఈఓ నర్రా నారాయణరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కుప్పం కొల్లారావు పేర్కొన్నారు.

భక్తి పరవశం.. శ్రీవారి బ్రహ్మోత్సవం



ధ్వజారోహణం చేస్తున్న వేద పండితులు

కొనకనమిట్ల: జిల్లాలో ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం స్వామి, అమ్మవార్ల మూలవిగ్రహమూర్తులను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ వేదపండితులు ప్రసాదాచార్యులు, వెంకట రమణాచార్యలు, దేవులపల్లి రామపవన్‌కుమార్‌శర్మ పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయదాతలు పోలంరాజు కొండలరావు సన్స్, ఆలయ కమిటీ ఈఓ చెన్నకేశవరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు కాశిరెడ్డి పర్యవేక్షణలో ధ్వజారోహణ కార్యక్రమం వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ సాగింది. ఈ సందర్భంగా ఆలయ ఈఓ మాట్లాడుతూ.. శనివారం తెల్లవారుజామున శ్రీవారి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

క్లుప్తంగా

కేజీ పొగాకు ధర రూ.280

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్టలో గల ఒంగోలు–1 పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో కేజీ పొగాకు ధర రూ.280 పలికింది. చిలంకూరు క్లస్టర్ పరిధిలో 139 బేళ్లను వేలానికి ఉంచగా, 100 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 39 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ కనిష్ఠ ధర రూ.270, సరాసరి ధర రూ.276.92 పలికింది. వేలంలో మొత్తం 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా, వేలం నిర్వహణ అధికారి ఎం.రవికాంత్ పర్యవేక్షించారు.

పచ్చాకు కూలీకి సన్మానం



ఏసురత్నంను సన్మానిస్తున్న మన్నే శ్రీనివాసరావు

ఒంగోలు సిటీ: ముండ్లమూరు మండలం వేంపాడు గ్రామానికి చెందిన పచ్చాకు కూలీ దండి ఏసురత్నం ప్రతిభను గుర్తించి ఒంగోలు మండలంలోని కరవది గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు శుక్రవారం సత్కరించారు. మన్నే శ్రీనివాసరావు బ్యారన్ వద్దకు కూలి పనులకు వచ్చిన ఏసురత్నం శుక్రవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఒక్కడే 1100 కర్రలకు పచ్చాకు కట్టి బ్యారన్‌లో పైకి ఎక్కి పేర్చాడు. సుమారు 24 మంది కూలీలు చేసే పనిని ఒక్కడే చేశాడు. వాస్తవానికి కూలీలు ఆకు అందిస్తేనే ఇది సాధ్యమవుతుంది. కానీ, ఎవరి సహాయం లేకుండా ఒక్కడే కర్రలు తీసుకుని బ్యారన్‌పైకి ఎక్కి పైనుంచి కిందకు పేర్చుకుంటూ వచ్చాడు. దీంతో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మన్నే శ్రీనివాసరావు దండి ఏసురత్నం దంపతులను శాలువాతో సన్మానించి అభినందించారు.

పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్ల పంపిణీ



విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్లు అందిస్తున్న ఏకలవ్య సమితి నాయకులు

చీమకుర్తి: చీమకుర్తి గరికమిట్టలోని ఏపీ గిరిజన బాలుర పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఏకలవ్య సమితి నాయకుడు పేరం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం రైటింగ్ ప్యాడ్లు పంపిణీ చేశారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు గిరిజన గురుకుల పాఠశాల నుంచి పరీక్ష కేంద్రాల వద్దకు వెళ్లేందుకు ఆటోలు ఏర్పాటు చేస్తున్నట్లు పేరం తెలిపారు. ఆటోల బాడుగలకు రూ.2,500ను పాఠశాల వార్డెన్‌కు అందించారు. పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వ్యక్తికి రూ.3 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.2 వేలను బహుమతులుగా ఇస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, బీసీ, ఎస్టీ సంఘాల నాయకులు, కౌన్సిలర్లు సోమా శేషాద్రి, పాటిబండ్ల గంగయ్య, చింతకింది అశోక్, గంగిరెడ్డి సుందరరామిరెడ్డి, పాదిలి కాశయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేప చిక్కక.. పూట గడవక..!

- మత్స్యకారుల తీవ్ర ఇబ్బందులు
- మత్స్యకార భరోసా కూడా అందించని కూటమి ప్రభుత్వం



కొత్తపట్నం సముద్రతీరంలో ఒడ్డునున్న బోట్లు, వలలు

కొత్తపట్నం: కూటమి ప్రభుత్వంలో మత్స్యకారుల సంక్షేమం గురించి పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో వారంతా అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మత్స్యకార భరోసా పథకం ద్వారా ఏటా వారి ఖాతాల్లో నగదు జమ చేయడంతో ఆర్థిక ఇబ్బందులు తప్పాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మత్స్యకార భరోసా పథకం ద్వారా రూ.20 వేల నగదు అందిస్తామని ఎన్నికల సమయంలో కల్లబొల్లి హామీలు ఇచ్చినప్పటికీ.. అధికారం చేపట్టి 9 నెలలైనా దాని గురించి మాట్లాడటం కూడా పాలకులు మానేశారు. దీంతో మత్స్యకారులను ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. దీనికితోడు ప్రస్తుతం మత్స్య సంపద కూడా పడక వారంతా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెచ్చిన పెట్టుబడులు కూడా రాక అప్పులపాలవుతున్నారు. వారం రోజుల నుంచి సముద్రంలో వేటకు వెళ్తే మత్స్య సంపద పడటం లేదు. ఒక్కో బోటుకు 30 లీటర్ల డీజిల్ నష్టం వస్తోందని గగ్గోలుపెడుతున్నారు. దీనికితోడు అలలు ఉధృతంగా ఎగసిపడుతుండటంతో బోట్లు ఎక్కడ మునిగిపోతాయోనని వేటకు వెళ్లడానికి కూడా మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం మత్స్యకార భరోసా పథకం ద్వారానైనా నగదు అందజేస్తే కొంత ఉపశమనం కలుగుతుందని ఆశిస్తున్నారు. కానీ, ప్రభుత్వం నుంచి అలాంటి ఉద్దేశమే లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్తపట్నం మండలంలోని గుండమాల, పిన్నింటివారిపాలెం, కె.పల్లెపాలెం, గమళ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెం, ఈతముక్కల, మడనూరు, రాజుపాలెం గ్రామాల్లో మోటరైజ్డ్ బోట్లు 596, నాన్ మోటరైజ్డ్ బోట్లు 153 ఉన్నాయి. వీటిపై 3,374 మంది చేపల వేట సాగిస్తున్నారు. వీరంతా ప్రస్తుతం మత్స్యసంపద పడక ఉండటానికి, తినడానికి కూడా అవస్థపడుతున్నారు. దీనికితోడు వచ్చే నెల 15 నుంచి వేట విరామ సమయం ప్రకటించనుండటంతో ప్రభుత్వం వెంటనే స్పందించి మత్స్యకారులకు పథకాలు అమలు చేయాలని, లేకుంటే తమ పరిస్థితి దారుణంగా ఉంటుందని మత్స్యకారులు అంటున్నారు.

కేంద్రరాష్ట్రాల కుట్రలను తిప్పికొట్టాలి



నిరసన ప్రదర్శన చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

ఒంగోలు టౌన్: విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయడానికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో సెంటర్లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల 15 వేల రూపాయలు కేటాయించి ఫ్యాక్టరీ అవసరాలకు వినియోగించుకోకుండా అప్పులు తీర్చడానికి మాత్రమే వాడుకోవాలని ఆంక్షలు పెట్టడం దారుణమన్నారు. అప్పులు తీర్చిన తరువాత కారుచౌకగా అమ్మేయడానికి కుట్రలు చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లు విశాఖ ఉక్కును కాపాడుకుంటామని చెప్పారని గుర్తు చేశారు. సెంటిమెంట్‌తో పనులు కావని, నష్టాలు భరించలేని స్థాయిలో ఉంటే విశాఖను వదులుకోక తప్పదని ఇప్పుడు చెబుతున్నారని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు మాట్లాడుతూ 32 మంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును కార్పొరేట్లకు కట్టబెట్టాలనే ప్రయత్నాలకు సరైన జవాబు చెబుతామన్నారు. ఉక్కు ఫ్యాక్టరీకి సొంత గనులను కేటాయించకుండా కొనసాగించడం కష్టమన్నారు. మూడు లక్షల కోట్ల విలువైన విశాఖ ఉక్కును కారుచౌకగా అమ్మేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నాటకాలాడుతున్నాయని ఏఐఎఫ్‌టీయూ నాయకుడు మోహన్ విమర్శించారు. కార్యక్రమంలో శ్రీరాం శ్రీనివాస్, ఆర్.లక్ష్మి, వీరారెడ్డి, ఎంఏ సాలార్, చీకటి శ్రీనివాసరావు, గంటెనపల్లి శ్రీనివాసరావు, లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగిస్తున్న కూటమి ప్రభుత్వం



ఒంగోలులో జగనన్న లే ఔట్ వద్ద పర్యటిస్తున్న సీపీఎం బృందం



నిప్పట్లపాడులో ఉపాధి హామీ కూలీల సమస్యలడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

ఒంగోలు టౌన్: నగర ప్రజల సొంతింటి కల నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, ప్రజలను మోసం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు విమర్శించారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం సీపీఎం బృందం స్థానిక వైఎస్సార్ జగనన్న లేఔట్లను పరిశీలించింది. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం నగరంలోని 20,840 మందికి పట్టాలు పంపిణీ చేసిందని తెలిపారు. అందులో అనర్హులు ఉన్నారన్న నెపంతో కూటమి ప్రభుత్వం పొజిషన్ చూపకుండా కాలయాపన చేస్తోందని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే ఒక్కొక్కరికి 2 సెంట్ల చొప్పున ఇంటి స్థలం ఇస్తామని చెప్పి నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికే 9 నెలలు గడిచిపోయాయని, రెండు బడ్జెట్లు కూడా ప్రవేశపెట్టారని చెప్పారు. ఒంగోలు నగర ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అగ్రహారం, అశోక్ నగర్, బాలాజీ నగర్, దత్తాత్రేయ కాలనీ, పోతురాజు కాలనీ, గుర్రం జాషువా కాలనీలను సందర్శించారు. అక్కడి ప్రజల సమస్యలడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చీకటి శ్రీనివాసరావు, కంకణాల రమాదేవి, జి.రమేష్, తంబి శ్రీనివాసరావు, సయ్యద్ హుసేన్, రాజేశ్వరి, వినోద్, రావూరి శ్రీనివాసరావు, వీరాస్వామి, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి మండలంలో...

చీమకుర్తి రూరల్: మండలంలో మర్రిచెట్లపాలెం, నిప్పట్లపాడు గ్రామాల్లో శుక్రవారం సీపీఎం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. సీపీఎం మండల నాయకులు పాల్గొని ప్రజల ఇబ్బందులడిగి తెలుసుకున్నారు. మంచినీటి బోర్లకు మరమ్మతులు చేయించాలని, సైడు కాలువల్లో పూడిక తీయించాలని, ఇళ్ల మధ్య ఉన్న హై ఓల్టేజీ విద్యుత్ లైన్ పక్కకు మార్చాలని ఎన్నిసార్లు చెప్పినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నిప్పట్లపాడు గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు ఆరువారాల బిల్లులు వెంటనే ఇవ్వాలని, పై రెండు గ్రామాల్లో సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పల్లి ఆంజనేయులు, శీలం ఆదినారాయణ, కంకణాల వెంకటేశ్వర్లు, శ్రీను, ప్రభుదాస్, చెన్నకేశవులు, ఆదాము తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలో...

సంతనూతలపాడు: ఒకే ఇంట్లో రెండుమూడు కుటుంబాలు కలిసి ఉంటున్నాయని, అది బాగా ఇబ్బందిగా ఉందని, తమకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని మండలంలోని ఎనికపాడు ఎస్సీకాలనీవాసులు ప్రజా చైతన్య యాత్రలో సీపీఎం బృందం దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని ఎనికపాడు ఎస్సీకాలనీలో శుక్రవారం రాత్రి సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను సీపీఎం బృందం దృష్టికి తీసుకొచ్చారు. శ్మశానానికి ఎదురుగా ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో అక్కడకు వెళ్లలేమని తెలిపారు. ప్రస్తుతం ఉంటున్న కాలనీ సమీపంలోనే ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరారు. గ్రామానికి బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. గ్రామంలో సైడు కాలువలు బాగలేవని చెప్పారు. సీపీఎం మండల నాయకులు బంకా సుబ్బారావు, నెరుసుల వెంకటేశ్వర్లు, ఎన్వీ నరసింహం పాల్గొన్నారు.



స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



స్వామివారికి కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు



స్వామివారి దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు



విద్యుత్ కాంతులతో ఆలయం

భక్తిశ్రద్ధలతో వీరాంజనేయస్వామి తిరునాళ్లు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో స్వయంభూగా వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి 39వ వార్షిక తిరునాళ్లను శుక్రవారం అత్యంత వైభవోపేతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, ఆకు పూజలు చేసి పొంగళ్లు నివేదించారు. రాత్రికి జరిగిన పూజా కార్యాక్రమంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయానికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నాగులుప్పలపాడు ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో మహాలక్ష్మి పూజలు



ఒంగోలు మామిడిపాలెం రామాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు



ఒంగోలు గాంధీరోడ్డు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళా భక్తులు

ఒంగోలు మెట్రో: ఫాల్గుణమాసం పౌర్ణమి లక్ష్మీ జయంతి పండుగ సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఒంగోలు నగరంలోని బాలాజీరావుపేటలో గల పోలేరమ్మ, కనకదుర్గమ్మ దేవస్థానాలలో, కొత్తపట్నం బస్టాండ్ వద్ద శ్రీ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో, గంటాపాలెం పార్వతమ్మ ఆలయంలో, సమతానగర్ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో, మంగమూరు రోడ్డు గాయత్రి మందిరంలో, లాయర్‌పేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో, కేశవస్వామిపేటలోని రాజ్యలక్ష్మి అమ్మవారికి, నీలంపాలెంలోని మహాలక్ష్మమ్మ అంకాలమ్మ ఆలయంలో, కొప్పోలు చెన్నకేశవస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి, కేశవస్వామిపేటలో విజయదుర్గ అమ్మవారికి, నెహ్రూ కాలనీలో దుర్గామల్లేశ్వరి అమ్మవారికి, గద్దలగుంటలోని మహాకాళి మహాలక్ష్మి మహాసరస్వతి దేవస్థానంలో, నగరంలోని ఇతర అమ్మవారి ఆలయాల్లో మూలవిరాట్లకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో అలంకరణ చేసి అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం మహిళా భక్తులచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

శాస్త్రోక్తంగా సత్యనారాయణస్వామి వ్రతాలు...

పౌర్ణమి సందర్భంగా నగరంలోని వివిధ వైష్ణవాలయాలలో రమావసుంధర సమేత శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలను వైభవంగా నిర్వహించారు. ఒంగోలు కేశవస్వామిపేటలోని ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో, మంగమూరుడొంక హరిహరసుత అయ్యప్పస్వామి క్షేత్రంలో, మామిడిపాలెం సీతారామస్వామి దేవస్థానంలో దంపతులచే సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రత క్రతువులను భక్తిశ్రద్ధలతో ఆలయ అర్చకులు నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.



నెహ్రూకాలనీలో దీపాలంకరణలో దుర్గామల్లేశ్వరి అమ్మవారు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

సంతనూతలపాడు: స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రెండోరోజు స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పరాంకుశం ప్రసాద్ ఆచార్యులు, పి.అజయ్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణలు చేసి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం భారీగా అన్నదానం ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో ఆలయ కమిటీ పరిరక్షణలో స్వామివారికి ప్రథమ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

కోలాహలంగా హోలీ వేడుకలు

ఒంగోలు మెట్రో: హోలీ పండుగ సందర్భంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా సంబరాలు అంబరాన్నంటాయి. ఒంగోలు నగరంలోని గాంధీ రోడ్డు, బండ్లమిట్ట, గుంటూరు రోడ్డు, రవిప్రియ మాల్, డీ6 కన్వెన్షన్ సెంటర్లో చిన్నారులు, యువతతో పాటు పెద్దలు సైతం హోలీ వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ముఖ్యంగా మార్వాడీలు, రాజస్థానీయులు, బెంగాలీలు కుటుంబ సమేతంగా రంగులు చల్లుకుంటూ సంతోషంగా హోలీ వేడుకలు జరుపుకున్నారు. అనంతరం సామూహికంగా భోజనాలు చేశారు. ఇళ్లలో ప్రత్యేకంగా దేవతారాధనలు చేశారు. హోలీ సందర్భంగా వివిధ పాఠశాలలు, కళాశాలల్లోనూ విద్యార్థులు రంగులు చల్లుకుని కోలాహలంగా కేరింతలు కొట్టారు.



హోలీ వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న యువత

బీజేపీ మండల అధ్యక్షురాలిగా అపర్ణ



నియామకపత్రం అందుకుంటున్న అపర్ణ

నాగులుప్పలపాడు: మండలంలోని టి.అగ్రహారం గ్రామానికి చెందిన పొద అపర్ణ బీజేపీ నాగులుప్పలపాడు మండల అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు చేతుల మీదుగా శుక్రవారం నియామకపత్రం అందుకున్నారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆమె అన్నారు. పార్టీ నాయకులు పలువురు అపర్ణను అభినందించారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం

కొమరోలు: మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు శనివారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి–2 బొర్రా వెంకటరత్నం తెలిపారు. శనివారం నుంచి ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రభుత్వం అందించిన సమయం ప్రకారం క్లాసులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లోనూ ప్రభుత్వ ఉత్తర్వులు తప్పనిసరిగా పాటించి ఒంటిపూట బడులు నిర్వహించాలని స్పష్టం చేశారు.